("జ్యోతి" మాసపత్రిక-ఆగస్టు 1964)

నీ పద్ధతి మార్చుకో

"వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీమ్ వందే జగన్మాతరమ్—" అని మంచి శ్రుతిలో వినబడుతున్నాది కలెక్టర్ రమణకి జీపు దిగేటప్పటికి—

ఉదయాన్నే పోలీస్ పెరేడ్ చూడ్డానికి వెళ్ళొస్తూవుంటే "టీ"కి పిల్చిన పోలీసు సూపరెంటుగార్ని—టీ అంటే జస్ట్ టీ; దట్సాల్! అని ఒక్క నిమిషంలో వదిలించుకున్నా; బంగళాకి చేరేసరికి పరిస్థితంతా తారుమారుగా కనబడింది. వరండాలో కూర్చునివున్న తాసిల్దారూ క్యాంపు గుమాస్తా మేం అప్పుడే వొచ్చేసేం సుమండీ అని చెప్పినట్టు నిలబడి నమస్కారాలు చేసేరు. ఇప్పుడు మాంచి శ్రుతిలో వెంకటేశ్వర సుప్రభాతం పూర్తి పాఠం వల్లిస్తున్న శేషుని వదుల్చుకుని క్యాంపుకి సిద్ధం కావాలంటే అదంత సుళువుగా అయ్యేపన్లా కనబళ్ళేదు.

అయినా; వదలని ఆశతో నెమ్మదిగా హుందాగా అడుగులేసుకుంటూ పూజామందిరం వేపు వెళ్ళేడు.

బూట్ల చప్పుడు విని శేషు యిటు తిరిగింది. "ఒక్క నిమిషం!" అని అనువుగా, మధురంగా నిర్బంధించింది. జిల్లా అందరిమీదా నిరాఘాటంగా పని చేసే కాఠిన్యం నిర్మొహమాటం శేషు దగ్గిర ఎందుకో మెత్తబడిపోతాయి. ప్రసాదం పుచ్చుకోందే టిఫిన్ ఊసెత్తడానికి వీల్లేదు. అదీ ఇక్కడి రూలు.

"ఒక్క నిమిషం" అయిపోయింది. శేషు వచ్చేస్తోంది. పళ్ళెంలో ఆరని కర్పూరజ్యోతి, కోసిన కొబ్బరి ముక్కలూ, తీర్థంతో నిండిన వెండిగ్లాసూ; వళ్ళివ్ని పట్టుకున్న పసుపు రాసుకున్న చేతులూ, ఆ చేతులమీదుగా వేళ్ళాడుతున్న తడి ఆరని జుట్టూ—

రమణ కంగారుపడి సిగరెట్టు పారేశాడు.

హారతి అందుకొమ్మన్నట్టు చేతిలో పళ్ళెం ముందుకి జాపింది శేషు. "థాంక్యూ" అని కర్మకాండ ముగించి "పద" అన్నట్టు డైనింగ్ టేబిల్ మీదికి చూపించేడు రమణ. ఆ చేతిలో ప్రసాదం వేస్తూ "బూట్లు విడిచేస్తే యేం?" అనకుండా వుండలేకపోయింది శేషు.

"నాకు టైమవుతున్నది. అవతల వాళ్ళంతా యెదురు చూస్తున్నారు"

"వాళ్ళేకాదు. మేం కూడా" అంది శేషు చిరునవ్వుతో.

సైడు వింగులోంచి నటీనటుల్ని గమనించే ప్రాంప్టర్లా నిలబడ్డ వంటావిడని కళ్ళతోనే పిల్చింది శేషు. "ఇదక్కడ పెట్టి; టిఫినేర్పాట్లు చెయ్యండి. బాబుగారు క్యాంపెళ్ళాలి" అంది.

"అన్నీ సిద్ధంగా వున్నాయి తల్లీ, తమరు ఖోం చెయ్యడమే తరువాయి."

టేబిల్ మీద స్టీలుగిన్నెలో ఇడ్లీ: గాజుగిన్నెలో కొబ్బరిపచ్చడి; సీసాలో కారప్పొడి, చిన్న గిన్నెలో నెయ్యి;ప్లేట్లు, చెంచాలూ—

ఆహారపాత్రకి రెండుచేతుల్తో నమస్కారంచేసి;మూతతీసి ప్లేట్లో ఇడ్లీలు పెట్టబోయింది శేషు.

చెయ్యి పట్టుకుని ఆపేశాడు రమణ.

"నాకేం నచ్చలేదు"

"తినకుండానే?"

"టిఫిన్ కాదు; నీ విధానం"

శేషు నవ్వింది "నా—విధానమా?"

"ఆ, హా! నీ—విధానమే. కట్టూ బొట్టూ వేషం భాషా అన్నీనీ!...."

"ఇప్పుడు నేనేం చేసేనని—"

"ఫర్ గాడ్స్ సేక్! నువ్వీ వేషం మానేద్దూ శేషూ! నిన్ను చూస్తే అమ్మమ్మ జ్ఞాపకం వొచ్చేస్తోంది!"

"నేను బామ్మ పోలికేగా!" అని నవ్వింది శేషు.

"జోక్స్ వెయ్యకు శేషూ. నేను సీరియస్‌గా మాట్లాడుతున్నాను!నీకిప్పుడు ఇరవై నాలుగేళ్ళు. పెళ్ళయి మూడేళ్ళు కూడా అవలేదు. ఈ పూజలూ పునస్కారాలూ నోములూ వ్రతాలూ ఆచారాలూ అమ్మమ్మ రూల్సూ ఇవన్నీ నాకు పనికిరావు.నువ్వు నా భార్యగా ఉన్నంతకాలం కలెక్టర్ సతీమణిలా ఉండాలి; అంతే!"

"తరవాత మాట్లాడుకుందాం లెండి. అవతల 'వాళ్ళు' ఎదురు చూస్తున్నారేమో" అని చెయ్యి విడిపించుకోబోయింది శేషు. రమణ ఆ చెయ్యి వదల్లేదు.

"ఫరవాలేదు, ఎదురు చూడనీ. దే ఆర్ పెయిడ్ ఫర్ ఇట్. ఇదేదో ఇవాళ తేలిపోవలిసిందే. నీకిక్కడ మాటాడదామని లేకపోతే మేడమీదికి రా." అని చెయ్యి వదిలేసి, కుర్చీలోంచి లేచిపోయాడు రమణ. గోడమీదున్న కాలింగ్

బెల్ బటన్ నొక్కి: పరిగెట్టుకొచ్చిన డఫేదారుతో చెప్పేడు. "క్యాంపు మధ్యాహ్నం రెండింటికి" సిగరెట్ వెలిగించుకుని చకచకా మేడెక్కిపోయాడు.

0 0 0

శేషు కూడా అతని వెనకాతలే మేడ మీదికి వెళ్ళింది. కాని ముందు తన గదిలోకి వెళ్ళింది. పట్టుచీరలోంచి వాయిల్ చీరలోకి మారింది. "ఈ తడిజుట్టు చూస్తే బతకనియ్యడు" అనుకుని నవ్వుకుంటూ; పైన సీలింగుఫాను తిరుగుతుండగానే పక్కనించి టేబిల్‌ఫాన్ గాలికూడా పెట్టుకుంది.

రెండు ఫాన్ల గాలికీ చిందర వందరౌతున్న జుట్టు అడ్డదిడ్డంగా యెగుర్తూ మొహం మీద కితకితలు పెడుతూవుంటే-చిక్కు దువ్వెన అటూ యిటూ నడిపిస్తూ-చిందర వందరవుతున్న ఆలోచనల మీద చిక్కుదువ్వెన లాంటిదేదైనా పని చేస్తుందా అని తన్ని తాను ప్రశ్నించుకొంది.

చిన్నప్పటి చిలిపితనం చెలాకీతనం ఏవీ, ఇప్పుడు? కాలేజీలో చదివినప్పుడు ఆడపిల్లల దగ్గిర్నించీ కళ్ళు తిప్పుకోలేని ఆకర్షణ తనది. ఈనిడ జోలికి పోకూడదురా నాయనా అనుకునేటంత విసురు. అవన్నీ ఇతగాడే పొట్టన బెట్టుకుని....మళ్ళానేమో నువ్వు అమ్మమ్మలా వున్నావంటాడూ?

తన పదిహేనోయేట ప్రారంభమైంది ఈ దండయాత్ర. శివాజీ బాబాయి పిన్నీ జెర్మనీ నించొస్తూ తనకి ఏవేవో ప్రెజెంటేషన్లు తెచ్చేరు. అందులో ఒకటి....తొడుక్కుని-తనెల్లా వుందోనని అద్దంలో చూసుకుంటూ వుంటే హటాత్తుగా అక్కడి కొచ్చేసి "నీకోసం రజని వొచ్చినట్టుంది శేషూ" అని చెప్పి; అద్దంలో తననీ, ఇవతల తననీ చూసి; కోపంగా, "సారీ!" అని వెళ్ళేడు. "ఏమిటే, పెళ్లికొడుకు అలిగినట్టున్నాడు?" అని రజని అడిగితే—"అవునే.మా బావకి; అడాళ్ళు బట్టలు కట్టుకుంటూవుంటే చూడ్డానికి సిగ్గూ!" అంది తను.

బి. ఎస్సీ రిజల్ట్సు పేపర్లో పడ్డనాడే పల్లెటూర్నించి వాళ్ళమ్మతో సహా వూడిపడ్డాడు. ఫస్టుక్లాసని అందరూ అనుకున్నదే. "నీ పరీక్షేమైందే?" అంది అత్త.

"పోయిందత్తా"

"నిజంగానే పోయిందా?" అని కసిరేడు.

"పో బావా: యేమిటి! ఇంటరుఫస్టియర్ ఫేలయ్యేటంత మొద్దునికాన్లే."

0 0 0

"నాకు మెడ్రాస్ యూనివర్సిటీలో ఆనర్స్ చదవడానికి సీటొచ్చింది.

ఎల్లుండి వెడుతున్నా"నని చెప్పేడు రమణ, ఆ తరవాత కొన్నాళ్ళకి, ఇంట్లో అందరూ వుండగా చూసి.

"బొస్ట, ఈ రోజు పేపర్లో వేసేరు" అని నవ్వుతూ పెళ్ళింది శేషు.

"హాస్టల్లో ఉంటావా?" అన్నాడు మేనమామ.

"లేదు. నా ఫ్రెండు జీవరత్నం ఉన్నాడు కదా. అతనికీ వొచ్చింది సీటు. ఇద్దరం కలిసి వాళ్ళ బంధువులింట్లో ఓ గది తీసుకుంటాం, అతనేమో వాళ్లింటిలో తింటాడు, నేను హోటల్లో తింటాను."

"నాకు మెడ్రాస్‌లో వైద్యనాథన్‌ని అని ఓ ఫ్రెండున్నాడోయి. వాళ్ళింట్లో ఉండకూడదు. నేను ఉత్తరం రాసిస్తానూ? నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు! భోజనం కూడా అక్కడే చెయ్యొచ్చు."

"సారీ మామయ్యా. ఈ విషయంలో జీవరత్నం నేనూ ఓ మాట అనుకున్నాం. అలాగే చేస్తాం. నువ్వు ఉత్తరం రాసేవు కదా అని ఆయనెవరో నాకు **భోజనం** పెట్టి గది ఇవ్వొచ్చుగానీ; రెండేళ్ళపాటు ఆ అరవ్వాళ్ళింటో నేను తిన్లేను."

శేషు ముందుకొచ్చింది "మెడ్రాసులో హోటళ్ళ వాళ్ళంతా తెలుగువాళ్ళని కాబోలు బావ వుద్దేశం" అని పకపకా నవ్వింది.

"అది కాదు శేషూ, నేనన్నది! నాలుగేళ్ళు ఈ వూళ్లో చదివి మీ ఇంట్లో తిన్నంత సుఖవుకాదని అలా అన్నాను."

"పోనీ వోపని చెయ్యకూడదు?" అంది కమలమ్మ—అంటే శేషు తల్లి—"అప్పుడనుకున్నట్టుగా పెళ్ళిచేసేస్తె ఇద్దరూ వెళ్లి ఉంటొచ్చుగా."

రమణ లేచి నిలబడిపోయాడు. "నో నో! అబ్‌సర్డ్! ఇంతోటి ఆనర్స్ చదువుకీ నాకొక గార్డియన్ ఉంటే తప్ప సాగదా యేమిటి? పెళ్లి అవుటాఫ్ కొశ్చన్.—అయినా శేషుకి నేను తగను కూడాను. మొంటిన్నించీ దాని టేస్టు వేరూ నాది వేరూనూ. కనక ఎవరైనా ఫారిన్ రిటన్డ్‌ని చూసి చేసియ్యండి. నాకోసం వెయిట్ చెయ్యక్కర్లేదు."

శేషు గబుక్కున లేచి అవతలి కెళ్ళిపోయింది.

"నువ్వు చెప్పింది రైటు కాదల్లుడూ" అన్నాడు మేనమామ. "నేను చూస్తున్నాన్లే, నువ్వేమో గడికోసారి దాన్ని ఇంగ్లీషు మాటాడొద్దంటావు. కష్టపడి బాబ్ చేయించుకున్న జుట్టు పొడుగ్గా పెంచుకుని వాల్జడ వేసుకోమంటావు. మహిళా

సమాజాలూ మీటింగులూ ఇంగ్లీషు సినిమాలూ మానేసి ఇంచక్కా మొహానికి పసుపురాసుకుని అంగారు బొట్టుపెట్టుకుని రెండు చేతులకీ గాజులేసుకోమంటావు. అయితే మాత్రం ఇవన్నీ చిన్నతనం సరదాలే కదుట్రా?"

0 0 0

ఆనర్స్ రెండేళ్ళకాలంలోనూ రమణ మేనమామ ఇంటిమీదకి తొంగిచూడలేదు. ఐ. ఏ. ఎస్. కి సెలెక్టయి ట్రెయినింగ్ అయిపోయేక మాత్రం ఓసారి వాళ్ళని పలకరించడం మంచిదవి అనుకుంటూ ఇంటికొస్తే తన గుమ్మంలోనే ప్రత్యక్షమైంది శేషు. అదీ ఎలాగా, వ్యాసపీఠంమీద భాగవతం పుస్తకం పెట్టుకుని తల్లికి సత్యభామా కల్యాణఘట్టం వినిపిస్తూనూ!

తామరసాక్షుడచ్యుతు డుదార యశోనిధి పెండ్లియాడె

నానామనుజేంద్ర నందిత గుణస్థితి లక్షణ సత్యభామను

ఉద్దామ పతివ్రతా త్వనయధర్మ విచక్షణ తాదయా యశఃకామను

సత్యభామను: ముఖద్యుతినిర్జిత సోమనయ్యేదన్—అన్న పద్యానికి ప్రతి పదార్థం తాత్పర్యం చెబుతూనూ!

"హౌ బ్యూటిఫుల్! క్వైట్ అనెక్స్పెక్టెడ్!" అన్నాడు.

"అక్కడికి నువ్వొక్కడివే ఏదో మహా ట్రెయినింగై వొచ్చినట్టు!" అంది శేషు.

"నాకిప్పుడెన్నొచ్చో తెలుసా? లక్ష్మీస్తోత్రం, విష్ణుసహస్రనామం, భజగోవింద శ్లోకాలు, అన్నపూర్ణాస్తవం, ఆఖరికి వెంకటేశ్వర సుప్రభాతం కూడా అర్థాలూ తాత్పర్యాల్తో సహా ట్రెయినింగై పోయేను!"

"నిజంగా?"

"నిజంగానే. ఈ వూరొచ్చి రెండేళ్లయింది. ఐతే ఇవన్నీ వొక్క నెల్లోనే నేర్చేసేను."

"మా పొలాలూ అవీ చూసేవా, మరి?" అన్నాడు రమణ ఉత్సాహంగా.

"చూణ్ణా మరి? రేపు నువ్వు కోతలకో నూర్పులకో వెళ్ళి కళ్ళాల్లో కూచుంటే నాయుడుబావకి ఎంకి పట్టికెళ్ళినట్టు అన్నం తీసుకురావొద్దూ?"

0 0 0

అలా ఆలోచించుకుంటూ పాతజ్ఞాపకాలు తోడుకుంటూ అభిజాత్యం ఓవేపూ ఉదాసీనత ఓవేపూ బాధపెడుతున్నా శేషు రమణ గదిలోకి వెళ్ళలేదు.

"లే, శేషూ! భోజనాలు చేద్దాం" అని రమణ పలకరిస్తే కూడా ఆమెకి ఉత్సాహం రాలేదు."నాకు భోంచెయ్యాలని లేదు."

"ఎందుకనేం? ఉదయం టిఫిను కూడా తిన్లేదు."

"నువ్వు మాత్రం తిన్నావేంటి? ఏవేవో జ్ఞాపకాలు—బాధగా ఉంది."

"అదంతేలే. నాకూ అల్లాగే. ఇంకచాలు గానీ పద."

"నన్నీపూటకి వొదిలేసి మీరు—"

"డోంట్ బి సిల్లీ. మనకా స్వతంత్రం లేదు. మనం ఇల్లా ఓ పూటంతా యెడమొహం పెడమొహం అని ఈపాటికే బోల్డు గుసగుసలైపోయుంటాయి." అని కాలింగ్ బెల్ బటన్ నొక్కాడు కలెక్టర్ రమణ.

"యస్సార్!" "వొస్తున్నానండి" "ఆయ్," అని మూడు కంఠాలు పలికాయి.

0 0 0

"నువ్వలా మౌనంగా ఉంటే నాకు బావుండదు శేషూ. నేచెప్పింది ఆలోచించు. ఈ జిల్లాలో కలెక్టర్ సతీమణి మహిళా సంఘానికి అధ్యక్షురాలుగా ఉండడం ఆచారంట. నీ మౌనం చాలా విమర్శకి అవకాశం యిచ్చింది."

"నాకలాంటి వాటిమీద నమ్మకం లేదు"

"ఒకప్పుడుండేదే కద."

"ఇప్పుడు లేదంటున్నాను కదా."

"అదికాదు శేషూ. నువ్వు పొడి పొడిగా మాటాడకు. తేల్చెయ్యి అటో ఇటో"

"అంటే? నాకు ఛాయిస్ ఉందిటా?"

"అఫ్‌కోర్స్. లేదు!"

"ఇప్పుడే కాదు, ఎప్పుడూ లేదు" అంది శేషు. "మంచిగానీ చెడ్డగానీ, నేను నమ్మనీ, నమ్మకపోనీ, నువ్వు చెప్పినట్టల్లా చేసీడమే నా కర్తవ్యం. స్టూడెంట్‌గా ఉండి మా నాన్నకి కాబోయే అల్లుడిగా ఉన్నప్పట్నుంచీ నువ్వే అధికారం చెలాయిస్తున్నావు.నేనెలావుంటే నీకు భార్యగా ఉండడానికి తగుదునో అన్నీగీతలు గీసిపెట్టేవు. నీ అభిరుచులు కాపాడ్డం కోసం మావాళ్ళూ మీవాళ్ళూ స్థితిమంతులే అయినా అన్నీ వొదులుకొని పాతకాలపు నగలూ సిద్ధాంతాలూ మోస్తున్నాను."

"అయామ్ సారీ శేషూ. టెరిబ్లీ సారీ. అప్పటిలో నేనిలా పెద్ద బాధ్యత గల పుద్యోగానికి వస్తాననుకోలేదు."

"రైటే బావా. కాని చిక్కల్లా ఎక్కడొచ్చిందంటే ఆరోజుల్లో నన్ను నువ్వు మారమన్నప్పుడు ఒక్కసారిగా నాగరీకం వొదిలేసి పాతకాలానికి వెళ్ళిపోడం కష్టం కదా, కష్టమైన పని చేస్తున్నానని గర్వంతో మారేను. అలా అని నన్ను అడుగడుక్కీ మారిపోమనడం న్యాయం కాదేమో అనిపిస్తుంది. పోనీ నేను నిన్ను కొంచెం మార్చాలనుకుంటే నువ్వు మారుతావా? అది చెప్పు."

"సమంజసం అయితే తప్పకుండా మార్తాను. దానికేం ఉంది?"

"నువ్వు ఇంటిలో వున్నప్పుడు, మనిద్దరం ఏదైనా బంధువులింటిలో శుభకార్యాని కెళ్ళినప్పుడూ పంచా లాల్చీ వేసుకోమన్నాననుకో. వేసుక్కుంటావా? ఇట్ లుక్స్ సోఫన్నీ!"

"అలా అంటే ఎలాగ—? పరిస్థితులు చూడాలి గదా."

"అంతెందుకు? ఇంకోటి చెప్తాను చూడు.నిన్నేదో బ్లాక్ మెయిల్ చేస్తున్నానని అనుకోకు. మనిద్దరి మధ్యా జరిగేదే చెప్తాను—ఆరోజు, అంటే మన పెళ్ళయిననాడు రాత్రి, నువ్వు నా దగ్గిరిగా వొస్తే నీ నోరు సిగరెట్టు వాసన వేస్తోందని—ముద్దుపెట్టుకోనివ్వలేదు, నేను: ఆవేళ నిన్ను కోరిందే నా మొదటి కోరిక, నీకొక్కవల్సిన ...ంగా నన్ను మూసలో పోసి తీర్చుకున్నావు కదా, వెంటనే ఈ అలవాటు మానేస్తావని గర్వంగా అనుకున్నాను. ఒక్కసారిగా ఎలా మానడం, క్రమంగా—అని తప్పించుకున్నావు. పదేపదే అడిగి నిన్ను విసిగించడం నాకు మొహమాటంవేసి వొదిలేనినందుకు నువ్వు నామాటని మర్చేపోయేవు. ఆఖరికి—నీకు గుర్తుండకతప్పదు కదా—ఓసారి మనం మైసూరు వెళ్ళేం. అక్కడ సినిమాహాల్లో నువ్వు సిగరెట్టు కాలుస్తూవుంటే నువ్విక్కడ కరెక్టరని తెలియక గొడవచేసేరు, నాకు కష్టమనిపించి "పోనీ మానెయ్యకూడదా" అన్నాను. "టేకిట్ ఈజీ" అన్నావు నువ్వు—

రమణ దీర్ఘంగా నిట్టూర్చాడు. టిన్‌లోవి, కేస్‌లోవి సిగిరెట్లన్నీ పోగుచేసి న్యూస్‌పేపర్లో వేసి లైటర్‌తో మంట చేసేడు. లైటర్‌ని చెత్తబుట్టలో వేసేడు. "ఐమ్ సారీ శేషూ" అని ఆమె చేతులు రెండూ పట్టుకున్నాడు.

"ఈ పాతివ్రత్యం ఎన్నాళ్ళులే." అనే చవకబారు వెక్కిరింపు శేషుకి నోటిదాకా వచ్చింది. కాని రమణ నిర్ణయంలో బలం ఆమెకి తెలుసును.అంచేత ఆ చేతుల్ని పైకెత్తి ముద్దుపెట్టుకుంది.

* *